

ఆర్‌టిసి అప్రెంటిస్‌కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ : జిల్లా పరిధిలో ఐటిఐ (డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆర్‌టిసిలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రజ రవాణాధికారి అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి అక్టోబరు 12వ తేదీ లోపు www.apprenticeshipin-dia.gov.on వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వచ్చే నెల 16వ తేదీన ఉదయం పది గంటలకు ఆర్‌టిసి జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ, వి.టి అగ్రహారం, విజయనగరంలో ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకుని హాజరు కావాలని తెలిపారు. ఇదివరకే ఎంపికై అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేయరాదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు 08922 294906 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

ఆటో మిత్ర ఎందరికో...?

- గత ప్రభుత్వ నిబంధనలే అమలు!
- లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పూర్తి
- నేడు అర్హుల తుది జాబితా విడుదల అయ్యే అవకాశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆటో మిత్ర పథకం కింద ఆటో, మ్యాక్సీ, మోటారు క్యాబ్ వాహనదారులకు సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తే అందరికీ అందుతుందని అంతా భావించారు. కానీ, ప్రభుత్వం వడపోతలతో అర్హుల సంఖ్యను కుదించేలా నిబంధనలు అమలు చేస్తోంది. గత ప్రభుత్వం వైఎస్‌ఆర్ వాహనమిత్ర పథకానికి ఏ ఆంక్షలను విధించిందో, వాటినే టిడిపి కూటమి ప్రభుత్వం కూడా ప్రామాణికంగా తీసుకుంది. పైగా, వైసిపి ప్రభుత్వం వాహనమిత్ర సాయం కింద 2023లో ఎంతమంది లబ్ధిదారులకు నగదు అందించిందో వారి డేటానే పరిశీలించాలని నిర్ణయించింది. గ్రామ, వార్డు సచివాలయాల లాగిన్‌లకు అదే డేటాను పంపింది. గత ప్రభుత్వం చివరిసారిగా 2023 సెప్టెంబర్ 29న వాహనమిత్ర సాయాన్ని అందించింది. ఆ తేదీ తర్వాత నుంచి ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకు సొంత వాహనాలు కలిగిన వారి నుంచి మాత్రమే కొత్తగా దరఖాస్తులను స్వీకరించింది.

పాత నిబంధనలే అమలు

స్త్రీ శక్తి పథకంతో తాము ఉపాధి కోల్పోతున్నామంటూ ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు పెద్దఎత్తున



ఆందోళనకు దిగడంతో, వారికీ సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆటో, మ్యాక్సీ, మోటారు క్యాబ్‌లపై ఆధారపడి బతుకుతున్న వారికి దసరా కానుకగా అక్టోబరు ఒకటో తేదీన ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున సాయం అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయం తెలిసిందే. పథకానికి సంబంధించిన అర్హతలు, నిబంధనలు తదితర మార్గదర్శకాలతో ఈనెల 13న జిఒ నంబరు 31 పేరుతో ఉత్తర్వులు వెలువరించింది. సొంత ఆటో లేదా మ్యాక్సీ, మోటారు క్యాబ్ కలిగి ఉండాలని, లైసెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, గత ప్రభుత్వం వాహనమిత్ర సాయానికి ఏవైతే ఆంక్షలు పెట్టిందో వాటినే యథాతథంగా అమలు చేస్తోంది. రూ.పది వేలు వేతనం పొందుతున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ, ఆశా తదితర చిరుద్యోగుల కుటుంబాలను అనర్హుల జాబితాలో చేర్చినట్లు తెలిసింది. కరెంట్ వినియోగం 300 యూనిట్లు దాటిన కుటుంబాల్లోని వ్యక్తుల పేర్లనూ పరిశీలనలోకి తీసుకోవడం లేదు. మూడు ఎకరాల పల్లం గానీ, పదెకరాల మెట్టు భూమి గానీ ఉన్న వారినీ అనర్హుల జాబితాలో చేర్చింది. గ్రామీణ ప్రాంతంలో వెయ్యి చదరపు అడుగులు, అర్బన్ ప్రాంతంలో 1500 చదరపు అడుగులు ఇల్లు ఉంటే వారిని పరిగణనలోకి తీసుకోలేదు.

నేడు అర్హుల జాబితా విడుదల!

గత వైసిపి ప్రభుత్వం వాహనమిత్ర సాయం పేరుతో 2023 సెప్టెంబరు 29వ తేదీన చివరిసారిగా 14,320 మందికి ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున నగదు అందించింది. ఇప్పుడు అవే వివరాలను టిడిపి కూటమి ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలకు పంపింది. జాబితాలో వచ్చిన వివరాల ఆధారంగా లబ్ధిదారులకు ఫోన్ చేసి వారితో ఇకెవైసి చేయించారు. మరణాలు, వాహనాలను ఇతరులకు అమ్మడం వంటి అంశాలు ఉంటే వాటిని డేటాలో నమోదు చేస్తున్నారు. ఆటో మిత్ర సాయం కోసం 2023 సెప్టెంబర్ 29 నుంచి ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకు సొంత వాహనాలు ఉన్న వారి నుంచి ప్రభుత్వం ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు కొత్తగా దరఖాస్తులను స్వీకరించింది. వాటిని పరిశీలించిన రవాణాశాఖ అధికారులు అర్హుల జాబితాను ప్రభుత్వానికి పంపారు. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పూర్తి కావడంతో ప్రభుత్వం బుధవారం అర్హుల తుది జాబితాను ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. అక్టోబరు ఒకటో తేదీని లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనుంది.

బడుగులపై పిడుగు

- ఇద్దరు మహిళలు మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు



ఊర్వశి (ఫైల్ ఫొటో)



పోలాకి : పద్మావతి మృతదేహం

ప్రజాశక్తి - కవిటి, పోలాకి

రెక్కాడితే గానీ డొక్కాడని ఇద్దరు మహిళా వ్యవసాయ కూలీలను పిడుగు బలి తీసుకుంది. మంగళవారం పిడుగులతో కురిసిన వర్షానికి కంచిలి మండలం జాడుపూడికి చెందిన రెయ్యి ఊర్వశి (39), పోలాకి మండలం ఉరజాంకు చెందిన కణితి పద్మావతి (45) మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కవిటి మండలంలోని ఆర్.కరాపాడులో వ్యవసాయ కూలి పనులకు కంచిలి మండలం జాడుపూడికి చెందిన ఊర్వశి, పిలక హేమ, కవిటి మండలం ఆర్.కరాపాడుకు చెందిన దక్కత హేమలత వెళ్లారు. పొలంలో ఉడుపు ఉడుస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగు పడడంతో ఊర్వశి అక్కడికక్కడే మృతి చెందారు. దక్కత హేమలత, పిలక హేమ తీవ్రంగా గాయపడ్డారు. పక్క పొలాల్లో ఉన్న కూలీలు స్థానికులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుల్ని ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఊర్వశి మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఊర్వశి భర్త ఎరన్నతో విభేదాల కారణంగా తల్లిదండ్రులు పలికల రంగయ్య, జోగమ్మ వద్ద ఉంటోంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి దుర్గారావు తెలిపారు.

పోలాకి మండలం ఉరజాంకు చెందిన కణితి పద్మావతి వరి పొలంలో కలుపు తీస్తుండగా, పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. భర్త కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంజిత్ కేసు నమోదు చేశారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

నేడు నూతన ఉపాధ్యాయుల పయనం

శ్రీకాకుళం సిటీ : డిఎస్‌సిలో ఎంపికైన ఉపాధ్యాయులకు విజయవాడలో ఈనెల 25వ తేదీన ధ్రువీకరణ పత్రాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందజేయనున్నారు. జిల్లాలో డిఎస్‌సికి ఎంపికైన ఉపాధ్యాయులు బుధవారం బస్సుల్లో విజయవాడ పయనం కానున్నారు. డిఎస్‌సిలో జిల్లాకు సంబంధించి 675 మంది ఎంపికయ్యారు. వీరు విజయవాడ వెళ్లేందుకు విద్యాశాఖ 37 బస్సులు ఏర్పాటు చేసింది. నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి బస్సులు బుధవారం బయలుదేరనున్నాయి. నూతన ఉపాధ్యాయునితో పాటు వెళ్లేందుకు మరొకరికి అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు తెలిపారు.

వాయుగుండంపై అప్రమత్తం

- మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు
- మండలాల్లో కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడుతుండడంతో రానున్న నాలుగు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వాయుగుండంపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నాటికి అల్పపీడనం వాయుగుండంగా బలపడి, అదే రోజు దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర మధ్య తీరం దాటుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోందన్నారు. దీని ప్రభావంతో తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, కలెక్టరేట్‌లో 08942 240557 ఫోన్ నంబరుతో కంట్రోల్‌రూమ్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ రోడ్లకు నష్టం వాటిల్లితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆదేశించారు. ప్రజలు వాగులు, సాగునీటి కాలువలు, చెరువుల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు. మట్టి గోడల ఇళ్లలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, పశువులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

పలు ప్రభుత్వ శాఖల పనితీరును, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై వచ్చిన ప్రజాభిప్రాయ సర్వే నివేదికలను సమీక్షించారు. రేషన్ పంపిణీ, దీపం పథకం, పంచాయతీ సేవలు, ఆర్‌టిసి బస్సు సర్వీసులపై ప్రజల సంతృప్తి స్థాయిని అడిగి తెలుసుకున్నారు. పిజిఆర్‌ఎస్ పెండింగ్ ఫిర్యాదులు, కోర్టు కేసుల పరిష్కార స్థితిని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. పంచాయతీలు, పారిశుధ్యం, ఉపాధి హామీ, ఇళ్ల స్థలాల పంపిణీ, రెవెన్యూకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కొత్తమ్మతల్లి ఉత్సవాలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఈనెల 25వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించే కొత్తమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కోరాడ చిన్నగోవింద, పురోహితులు సుసరాపు గణపతిశర్మ, లక్ష్మీకాంతంశర్మ పూర్ణకుంభంతో ఆలయంలోకి స్వాగతం పలికారు. మంత్రులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, కింజరాపు హరివరప్రసాద్, హరిప్రభాకర్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచీ యాత్రికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



పట్టువస్త్రాలను సమర్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

ఆలయంలో ఉన్న అమ్మవారి జంగిడిని అసాదీల కుటుంబీకుల పెద్ద తలపై పెట్టుకొని తల్లికి నిలయమైన రెడ్డిక వీధికి చెందిన కమ్మకట్టు చిన్నఅప్పలనాయుడు ఇంటి వరకు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. జంగిడిని గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు రెడ్డిక వీధి నుంచి కలశాలతో ఊరేగింపుగా కొత్తమ్మతల్లి ఆలయానికి తీసుకొస్తారు.



నేలకొరిగిన భారీ కటౌట్

హెలీకాప్టర్ రైడ్‌ను ప్రారంభించిన మంత్రులు

కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హెలీకాప్టర్ రైడ్‌ను కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఉత్సవాలకు హెలీకాప్టర్ రైడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. కొత్తపేట నుంచి కోటబొమ్మాళి వరకు ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్‌ను మంత్రులు ప్రారంభించారు.

భారీ వర్షానికి నేలకొరిగిన కటౌట్

కొత్తమ్మతల్లి ఉత్సవాలకు విద్యుత్ అలకంకరణతో ఏర్పాటు చేసిన కటౌట్ మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి నేలకొరిగింది. పెద్ద చెరువు దగ్గర పెట్టిన కటౌట్ నేలకొరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో సుమారు మూడు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగింది.

పటిష్ట బందోబస్తు

ఉత్సవాలకు 800 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు ఉత్సవాలకు వంద సిసి కెమెరాలు, ఆరు డ్రోన్ కెమెరాలతో పాటు పది ఎల్ఇడి తెరలను పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశారు. బందోబస్తు విధానం, యాత్రికుల రద్దీ, క్యూలైన్ సక్రమ నిర్వహణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించారు. తప్పిపోయిన పిల్లలు, వస్తువుల ట్రేసింగ్ కోసం ప్రత్యేక కంట్రోల్ డెస్క్ ఏర్పాటు చేశారు. యాత్రికుల రద్దీ నేపథ్యంలో ఆకతాయిలను అరికట్టడం, జేబు దొంగల నియంత్రణకు ప్రత్యేక క్రైమ్ పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సమగ్ర భద్రతా చర్యలు చేపట్టామని ఎస్‌పి మహేశ్వర రెడ్డి తెలిపారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ : రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) డిమాండ్ చేసింది. ఇదే డిమాండ్‌పై ఆర్ అండ్ బి బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ నాయకులు సిహెచ్.రవి, బి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు నియామకాలు చేపట్టాలని కోరారు. విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కళాశాలల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అధ్యాపకుల పోస్టుల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. లైబ్రేరియన్ల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల వాలంటీర్లను కొనసాగించాలని, రూ.పది వేల వేతనం అందజేయాలన్నారు. ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు రూ.మూడు వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా అమలు చేయడం లేదని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోతే, భవిష్యత్‌లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

హిట్ అండ్ రన్ బాధితులకు త్వరితగతిన పరిహారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్ : హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు త్వరితగతిన నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ స్కీమ్ కన్వీనర్, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం నిర్వహించిన మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధితులు కుటుంబంలో వ్యక్తులను కోల్పోయి ఎంతో కష్టంలో ఉంటారని, వారికి అందే నష్టపరిహారం విషయంలో అలసత్వం వహించవద్దని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై సిబ్బంది త్వరగా విచారణ పూర్తి చేసి, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అధికారులు మాట్లాడుతూ పెండింగ్ కేసుల వివరాలను వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరిబాబు

కమ్యూనిటీ సైన్స్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆమదాలవలస

బిఎస్‌సి హానర్స్ కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు ఆచార్య ఎన్.జి రంగా విశ్వవిద్యాలయం, గుంటూరు దరఖాస్తులను ఆహ్వానిస్తోందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ - ఎపిఇఎపి సెట్‌తో సంబంధం లేకుండా నేరుగా నాలుగేళ్ల ప్రొఫెషనల్ డిగ్రీలో ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. బైపిసి, ఎంపిసి అగ్రికల్చరల్, హార్టికల్చరల్, వెటర్నరీ డిప్లమో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వసతి సదుపాయం కలదని తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి పలు రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏకైక కమ్యూనిటీ సైన్స్ కళాశాల అని తెలిపారు. డిగ్రీ నుంచి పిహెచ్‌డి వరకు కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులు www.angrau.ac.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఈనెల 30వ తేదీ దరఖాస్తుల దాఖలుకు చివరి తేది అని తెలిపారు.

రైస్‌మిల్లు కార్మికుల నిరసన

ప్రజాశక్తి - మందస

కార్మిక చట్ట సవరణ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, పది గంటల పని విధానాన్ని రద్దు చేసి ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఆర్.కె పురం పరిధిలోని రైస్ మిల్లు కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కె.కేశవరావు మట్లాడుతూ బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో కార్మిక చట్టాలను మార్చి 8 గంటల పని దినాన్ని పది గంటలకు పెంపుదల చేస్తూ అసెంబ్లీలో తెలుగుదేశం, జనసేన, బిజెపి ఎమ్మెల్యేలు ఆమోదించారని తెలిపారు. కార్మిక వ్యతిరేక చర్యను సిఐటియు ఖండిస్తోందన్నారు. వైసిపి అసెంబ్లీకి వెళ్లకుండా, మండలిలో వాకౌట్ చేసి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పని గంటల పెంపును కార్మికులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు కార్మికుల సంఘం నాయకులు కె.బి వెంకటేశం, జి.లచ్చుమయ్య, ఎస్.లచ్చయ్య, బి.మల్లేసు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైస్‌మిల్లు కార్మికులు

రెడ్‌క్రాస్ ప్రథమ చికిత్స శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన ఒక రోజు ప్రథమ చికిత్స శిక్షణా తరగతులు, ఎనిమిది రోజుల సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణా కార్యక్రమాలు త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ పూర్తి చేసి సర్టిఫికెట్ పొందిన వారికి వైద్యారోగ్య శాఖ, ప్రైవేట్ ఆస్పత్రులు, పరిశ్రమలు, కర్మాగారాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్లు దేశవ్యాప్తంగా చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేశారు. అభ్యర్థుల సంఖ్య పరిమితమై ఉండడం వల్ల 'ముందు వచ్చే వారికి ముందుగా అవకాశం' విధానంలో ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందాలనుకునే వారు నేరుగా శ్రీకాకుళం రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని సంప్రదించాలని, మరిన్ని వివరాల కోసం 9440490525 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఈశ్వరరావు

కార్మికుల పనిగంటలు తగ్గించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం పని కాలాన్ని 10 గంటలకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులు ఉద్యమించాలని, కార్మిక చట్ట సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు హెచ్.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. టెక్కలి సిఐటియు కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్నే అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో కార్మిక చట్టాలను మార్చి 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు పెంపుదల చేస్తూ అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ఆమోదించిందని అన్నారు. వైసిపి ఎమ్మెల్యే అసెంబ్లీకి వెళ్లకుండా బాధ్యతా రహితంగా వ్యవహరించడం సరికాదన్నారు. సోంపేటలో అక్టోబరు 4,5 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా సిఐటియు మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు సంఘాల షణ్ముఖరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



అవస్థలు పడుతున్న రైతులు

యూరియా కోసం రైతుల పాట్లు

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని సిలగాం సింగివలస ఎఫ్‌సిఐ గొడౌన్ వద్ద ఉన్న డిసిఎంఎస్ కేంద్రంలో రైతులు మంగళవారం యూరియా కోసం పాట్లు పడ్డారు. చాలా రోజుల నుంచి యూరియా కొరత ఉంది. ఇటీవల వ్యవసాయ శాఖ అధికారులు నామమాత్రంగా వస్తున్న యూరియాను అప్పటికప్పుడే పంపిణీ చేస్తున్నారు. దీంతో యూరియా కోసం రైతులు రోజూ పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం కూడా యూరియా లేకపోవడంతో రైతులు వెనుదిరిగారు.

అందుబాటులో బాల సాహిత్య పుస్తకాలు

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు బాల సాహిత్య పుస్తకాలను అందుబాటులో ఉంచామని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విద్యార్థులతో దసరా పద్యాలలో భాగంగా రైలు బండి పద్యం విశిష్టతను తెలియచేశారు. ఐదు దశాబ్దాల క్రితం విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరమణమూర్తి రచించిన రైలు బండి పద్యం విద్యార్థులతో వల్లె వేయించి వాటి విశిష్టతను తెలిపారు. దసరా సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి బాల సాహిత్యం, రామాయణ, మహాభారతం పుస్తకాలు చదవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్‌లో మౌలిక వసతులు మృగ్యం

- అధ్వానంగా రోడ్లు
- రాత్రయితే అంధకారమే
- విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం



అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జాతీయ రహదారి ఆనుకుని ఉన్న నవభారత్ సమీపంలోని పారిశ్రామికవాడ మౌలిక వసతులకు దూరంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎపి పరిశ్రమల మౌలిక వసతులు కల్పనా సంస్థ) కనీసం స్పందించడం లేదు. 16.32 ఎకరాల విస్తీర్ణం ఉన్న పారిశ్రామికవాడలో 32 పరిశ్రమలు ఉన్నాయి. జాతీయ రహదారి నుంచి నాలుగు రోడ్లు ఉండగా, రెండు రోడ్లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగతా రెండు రోడ్లు ఆక్రమణలో ఉన్నాయి. వాస్తవంగా పారిశ్రామికవాడలో పారిశ్రామికవేత్తల సమైక్య ఉండాలి. స్థానిక పారిశ్రామిక వేత్తలను ఎన్నుకోవాలి. ఈ సమైక్య అభివృద్ధిపై సమీక్షిస్తూ ముందుకు సాగాలి. కానీ, సమాఖ్య ఇక్కడా లేదు. ఈ పారిశ్రామికవాడలో అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. జాతీయ సర్వీస్ రోడ్డుకి ఆనించి పారిశ్రామిక వాడలోకి ప్రవేశించే వద్ద వెడల్పు తక్కువగా ఉండడం, రోడ్డు అధ్వానంగా ఉండడంతో లారీలు మరమ్మతులకు గురైన సందర్భాలు ఉన్నాయి. దీంతో రెండు మూడు రోజుల పాటు లారీలు అక్కడే ఉండడంతో మిగతా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న రెండు రోడ్లు గోతులమయమయ్యాయి. రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీంతో పారిశ్రామికవాడ అంధకారంలో కొట్టుమిట్టాడుతుంది. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. అధికారుల నిర్లక్ష్యం ఈ పారిశ్రామిక వాడకు శాపంగా మారింది. అధికారుల దృష్టికి సమస్యలను పలుమార్లు తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. పరిశ్రమలకు రా మెటీరియల్స్, తయారీ వస్తువుల ఎగుమతి వంటి వాటి వల్ల వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. రోడ్లు అధ్వానంగా ఉండడంతో చిన్న వర్షానికే గోతుల్లో నీరు చేరడం, రోడ్డంతా బురదగా ఉంటుంది. చిన్న వర్షం కురిసినా బురద కావడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. పదేళ్ల నుంచి ఎటువంటి రోడ్డు మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు.



విద్యుద్దీపాల్లేని స్తంభం

మౌలిక వసతులపై అధికారులు కన్నెత్తి చూడటం లేదు. మరోపక్క తుప్పలు ఆవరిస్తున్నాయి. పారిశ్రామికవాడపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పారిశ్రామిక వేత్తల సమైక్య ఏర్పాటు చేయాలని విన్నవించుకుంటున్నారు.

ప్రత్యేక దృష్టిసారిస్తాం

నవభారత్ పారిశ్రామికవాడలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తాం. వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నాం. రోడ్ల నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలుస్తాం. త్వరలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తాం. కలెక్టర్ దృష్టిలో సమస్యలు పెట్టాం. ఐలా ఏర్పాటుకు కృషి చేస్తాం.

- జయచంద్ర,
ఎపి పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనా సంస్థ కమిషనర్

ఎన్ఇఆర్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

ఎచ్చెర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తప్పుడు పనులు చేసి ఎటువంటి అవినీతికి పాల్పడడం లేదని అసెంబ్లీలో ప్రమాణం చేయడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆరోపించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్ఇఆర్‌కి అసెంబ్లీలో జీరో అవర్‌లో స్పీకర్ మాట్లాడడానికి అవకాశం కల్పిస్తే నియోజకవర్గ సమస్యలు, ప్రజల సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి కోసం మాట్లాడకుండా వ్యక్తిగత విషయాలు ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్నారు. మండలంలోని సంచాం కొండ ఒకరు లీజులో ఉండగా ఆ లీజు రద్దు చేయాలని వారి అనుచరులతో కొండ వద్ద బీభత్సం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ లీజు దారుడికి పక్క నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే కొమ్ముకాస్తున్నారని అసెంబ్లీలో ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఆయన స్కూల్, ఇంటి ఆవరణానికి కొన్ని వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను ఏ విధంగా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

వేసుకొని చదును చేసుకున్నారన్నారని ప్రశ్నించారు. రణస్థలంలో నేషనల్ హైవే పనులకు లైసెన్స్ ఉన్న కాంట్రాక్టులను కాదని తన సొంత కాంట్రాక్టర్లతో అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి వనరులను ధ్వంసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షులు బొంతు సూర్యనారాయణ, జి.సిగడాం వైసిపి మండల అధ్యక్షులు మీసాల వెంకట రమణ, లావేరు ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- కంచిలి

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కొల్లూరు, ఎమ్మెస్ పల్లి సచివాలయ ఉద్యోగులు మంగళవారం నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయా సచివాలయాల ముందు ప్లే కార్డు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, బకాయి ఉన్న డిఎ, ఇతర అలవెన్సులు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల జెఎసి అధ్యక్షుడు జయకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస నియోజకవర్గానికి సంబంధించి పంచాయతీరాజ్ నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ వి.ఆర్.కృష్ణతేజను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పలాస నియోజవర్గం పరిధిలో ఎనర్జీస్ బిల్లు పెండింగ్ ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని కోరారు. అసంపూర్తిగా నిలిచిన వజ్రపుకొత్తూరు మండలం ఎంపిడిఒ కార్యాలయం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి మోక్షం కలిగించాలని విన్నవించారు.

ప్రజా సమస్యలపై ప్రస్తావన



మెళియాపుట్టి: పాతపట్నం నియోజకవర్గ కేంద్రానికి అగ్నిమాపక కేంద్రం మంజూరు చేయాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం కోరారు. అగ్ని ప్రమాదాల సమయంలో ఒడిశా ప్రభుత్వంపై ఆధారపడుతున్నామని అన్నారు. నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లో అగ్నిమాపక కేంద్రం లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎల్ఎన్‌పేటలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కవిటి: మండలంలోని వరక పంచాయతీ సర్తుపుట్టుగ నుంచి తలగానపుట్టుగ వరకు సిసి రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల అనుసంధానానికి నాణ్యమైన రహదారులు ముఖ్యమని అన్నారు. మెరుగైన రహదారుల నిర్మాణంలో భాగంగా ఎన్ఆర్‌జిఎస్ నిధులు రూ.కోటితో సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబ, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, జెడ్ఆర్‌యుసి మెంబర్ శ్రీనివాసరాళో, సీపాన వెంకటరమణ, పుల్లట రాజు, మార్పు ప్రసాద్, నర్తు కేశవరావు, మహేష్, శ్రీను పాల్గొన్నారు.



మహిషాసుర మర్ధిని నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

అలరించిన నృత్యాలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో మంగళవారం వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులచే కూచిపూడి భరతనాట్యం చూపరులకు అలరించాయి. అకాడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి, జయలక్ష్మి దంపతులు, నాట్య గురువు బలివాడ శృతి పట్నాయక్ ఆధ్వర్యాన 30 మంది నాట్య కళాకారులు పాల్గొన్నారు. అమ్మవారి ఎదురుగా ఓం శక్తి పరాశక్తి పాటతో ప్రారంభమై కళావేదిక వద్ద మహాగణపతి, మహిషాసుర మర్దిని తదితర అమ్మవారి పాటలకు చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు యాత్రికులు అలరించాయి. అద్భుత ప్రదర్శన ఇచ్చిన కళాకారులకు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు సత్కరించారు.

న్యాయవాది మృతి

పలాస : మండలంలోని గోపాలపురానికి చెందిన న్యాయవాది దానేటి నందగోపాల్ గుండె పోటుతో మంగళవారం మృతి చెందారు. ఈయన 30 ఏళ్లుగా సొంపేట, పలాస కోర్టుల్లో న్యాయవాదిగా పనిచేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు కోర్టు ఆవరణలో పనివేళల అనంతరం పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అధ్యక్షతన న్యాయవాదులు మౌనం పాటించి ఆయనకు నివాళ్లర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో పలాస బార్ అసోషియేషన్ అధ్యక్షులు ఫైయాజ్ ఆహ్మద్ (గని), కార్యదర్శి బెండి కాళిదాస్, కోశాధికారి వి.రవి, లైబ్రేరియన్ కోత రజనీకుమార్, న్యాయవాదులు పి.రాజారత్నంనాయుడు, కర్రి శేషగిరి, హేమకుమార్, మురళి, కె.దేవరాజు, జి.ప్రభాకర్, రామకృష్ణ, పిండి వెంకటరమణ, రవికుమార్ పట్నాయక్, పొలాకి నారాయణ, చిట్టిబాబు, శ్రీనివాస్, సుధారాణి, దివ్య మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా 'కొత్తమ్మతల్లి' ఉత్సవాలు

టెక్కలి రూరల్ : టెక్కలి పాల కేంద్రం సమీపంలో ఉన్న కొత్తమ్మతల్లి ఉత్సవాలు మూడు రోజులు పాటు ఘనంగా డబ్బిరీ రాజరత్నం ఆధ్వర్యాన నిర్వహిస్తారు. మంగళవారం పూజలు చేసి మేలతాళాలతో ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో చౌదరి సింహాచలం, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సికి చేరిన పుస్తకాలు

జలుమూరు : ఎంఆర్‌సి కార్యాలయానికి రెండో విడత పాఠ్య పుస్తకాలు చేరాయని ఎంఇఒ-2 ఎం.వి.ఆర్.ఎస్.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 7230 పాఠ్య పుస్తకాలు వచ్చాయని అన్నారు. దసరా సెలవులు అనంతరం విద్యార్థులకు ఈ పుస్తకాలు అందజేస్తామని అన్నారు.

శాసనమండలిలో చర్చించాలి



వినతిపత్రం అందజేస్తున్న కృష్ణమూర్తి

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట పట్టణానికి సమీపంలోని బీల (చిత్తడి నేల)లని గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆధారంగా పరిరక్షించేందుకు చర్యలు చేపట్టేందుకు సహకరించాలని పిపిఎస్ అధ్యక్షుడు డాక్టర్ వై.కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి వెలగపూడిలోని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అతి పురాతనమైన ప్రకృతి సంపద బీల అని, ఇక్కడి ప్రజలకు తాగునీరు, సాగు నీరు అందించే ప్రధాన నీటి వనరని తెలిపారు. దీనిపై మూడు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయని, 148 రకాల పక్షులు, సున్నితమైన జీవ వైవిధ్యం ఉన్న ప్రాంతమని అన్నారు. 2009లో ఈ బీలను ఎన్‌సిసి కంపెనీకి అమ్మి పవర్ ప్లాంట నిర్మాణానికి అనుమతి ఇచ్చారన్నారు. పర్యావరణపరంగా అతి ముఖ్యమైన ఈ నీటి వనరుని కాపాడమని 15 ఏళ్ల నుంచి ప్రజలు పోరాటం చేస్తున్నామని అన్నారు. ఈ అంశాలను శాసనమండలిలో ప్రస్తావించి ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అలాగే శాసనమండలి చైర్మన్ మోసేన్ రాజుకు సైతం వినతిపత్రం అందించారు.

స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి- కంచిలి

ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీ చేసే అంశంలో స్థానిక అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కంచిలికి చెందిన సుధాం ప్రధాన్, బొగబెనికు చెందిన నేతాజీ ప్రధాన్ కోరారు. ఈ మేరకు మంగళవారం విలేకరుల వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాలలో ఒరియా గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. ఈ పోస్టు నియామకానికి సంబంధించిన అర్హతలు తమకు ఉన్నాయని, అయితే నిబంధనలకు విరుద్ధంగా ఒడిశాలో ప్రాథమిక విద్య, ఉన్నత విద్య పూర్తి చేసిన అభ్యర్థికి ప్రిన్సిపాల్ పోస్టు ఖరారు చేశారని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అత్యధిక



ఆవేదన వ్యక్తం చేస్తున్న స్థానిక అభ్యర్థులు

అర్హత ఉన్న స్థానిక అభ్యర్థులకే పోస్టు ఖరారు చేయాల్సి ఉందన్నారు. ప్రిన్సిపాల్ దీనికి విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, వచ్చిన దరఖాస్తుల్లో పిహెచ్‌డి చేసిన అభ్యర్థికి ఆర్‌జెడి సూచనల మేరకు పోస్టు ఖరారు చేసినట్లు తెలిపారు.

క్షయ నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న బాలాజీ

ఎచ్చెర్ల: క్షయ వ్యాధిని నిర్మూలించాలంటే యువత ముందడుగు వేయాలని ట్రిబుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ అన్నారు. క్షయ మిత్రలుగా విద్యార్థులు బాధ్యత తీసుకుంటే, రోగులకు మానసిక, సామాజిక బలాన్ని అందించగలరని పేర్కొన్నారు. ట్రిబుల్ ప్రాంగణంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన టిబి ముక్త భారత్-నిక్షయ మిత్ర స్వచ్ఛంద నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహిం చారు. స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వచ్చే 2 వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ గేదెల రవి, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ ప్రసాంత్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పశుపోషకులకు ఆర్థిక నష్టం కలిగిస్తున్న గాలికుంటు వ్యాధిపై అందరూ అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు పిలుపునిచ్చారు. మండలంలోని జోడూరులో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 12,100 టీకాల లక్ష్యం కాగా, ఇప్పటివరకు 3,500 టీకాలు వేసినట్లు చెప్పారు. గాలికుంటు వ్యాధి సోకిన పాడిపశువులో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువు పాలు దూడ తాగితే వెంటనే



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కరుణాకరరావు

చనిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జిపురం కూర్మారావు, జనసేన మండల కార్యదర్శి వాకాడ గణేష్, పి.ఎల్.పురం పశు వైద్యాధికారి కె.మౌనిక, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సింహాచలం, పశువైద్య సహాయకులు సరస్వతి, చిన్నాలు దిల్లేశ్వరరావు, గణపతి పాల్గొన్నారు.



కవిటి : మాట్లాడుతున్న డాక్టర్ సురేష్

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ

ప్రజాశక్తి- నరసన్నపేట

మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మాకివలస పిహెచ్‌సి వైద్యులు శిరీష, విజయకుమార్ సూచించారు. మండలంలోని గోపాలపెంటలో సచివాలయం వద్ద స్వస్థ్ నారీ స్త్రీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.కిశోర బాలికల పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం రక్త పోటు, మధుమేహం, కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయం కేన్సర్‌పై వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం మీనాక్షి ,విజయలక్ష్మి, ఝాన్సీరాణి, సీతామాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి: ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు వినియోగించుకోవాలని చిన్నపిల్లల వైద్య నిపుణులు, కవిటి సిహెచ్‌సి వైద్యులు సురేష్ తెలిపారు. 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'లో భాగంగా కవిటి సిహెచ్‌సిలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో 108 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదే విధంగా పలువురి రక్త నమూనాలు సేకరించి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు హేమలత, వాణి, మాజీ సర్పంచ్‌లు ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, నాయకులు ఆరింగి త్రివిక్రమరావు, బెందాళం తిరుమల కుమార్, వజ్జ రంగారావు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి- ఆమదాలవలస

విలువలతో కూడిన విద్య అవసరమని, సంస్కారవంతమైన జీవన విధానం అత్యవసరమని సత్యసాయి సేవా సంస్థలు విద్యాజ్యోతి రాష్ట్ర ఇన్‌ఛార్జీ ఎస్.వి.ఎస్.గురుప్రసాద్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సత్యసాయి యువ వికాస్ కార్యక్రమం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎస్ఎన్ స్వామి ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 95వ గ్రూమింగ్ ఫర్ ఎక్స్ లెన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన బోధన సిబ్బంది అభినందించారు. జిల్లావ్యాప్తంగా వంద విద్యాసంస్థల్లో 15 వేల మందికి పైగా విద్యార్థులకు మానవతా విలువలు బోధించడం ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఎం.జనార్థన్ విద్యార్థులతో మాట్లాడుతూ మానవతా విలువలతో పాటు వ్యక్తిత్వ వికాసం ఆదర్శనీయ వ్యక్తుల జీవిత చరిత్రపై ఆసక్తికరమైన అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా



మాట్లాడుతున్న గురుప్రసాద్

సేవాదళ్ కో-ఆర్డినేటర్ లలిత, టౌన్ యూత్ కో-ఆర్డినేటర్ దామోదర పట్నాయక్, సత్యసాయి సేవా సమితి వేణంపేట ప్రతినిధి యు.సూర్యనారాయణ పాల్గొన్నారు.

వ్యర్థాల వస్తువులు ప్రదర్శన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో సేకరించిన వ్యర్థాల నుంచి వస్తువులను తయారు చేస్తున్నామని కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. ఈ మేరకు స్థానిక జ్ఞాన భారతి విద్యా సంస్థలో వ్యర్థాల నుంచి నూతన వస్తువుల తయారీ ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 8,9,10 తరగతి విద్యార్థులు వివిధ వ్యర్థ పదార్థాలతో నూతన వస్తువులను తయారు చేశారు. కమిషనర్ ఈ ప్రదర్శనను తిలకించి విద్యార్థుల అద్భుత ప్రతిభను ప్రశంసించారు. విద్యార్థులు వ్యర్థాల నుంచి నూతన వస్తువులను తయారు చేసేందుకు ఎటువంటి ప్రక్రియను ఉపయోగించారో పాఠశాల సెక్రటరీ సిఇఒ



తిలకిస్తున్న కమిషనర్ రమేష్

జోహార్‌ఖాన్ వివరించారు. మున్సిపాలిటీలోని అన్ని పాఠశాలల ప్రదర్శనలను పరిశీలించిన తర్వాత బహుమతులను ప్రకటిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.బి.పండ, ప్రధానోపాధ్యాయులు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్‌పోర్టు మేనేజర్ అలీమ్‌ఖాన్ పాల్గొన్నారు.

15 మంది రక్తదానం

ఇచ్ఛాపురం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పిఒ పాండవ సంతోష్ కుమార్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 15 మంది పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యులు ఎం.షామిలి వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్.తాతారావు, అధ్యాపకులు దుర్యోధన, శివకుమార్, సీతమ్మ, విద్యార్థులు స్నేహ, గాయత్రి, యువరాజ్, వసంత్, అక్షయ్, భాస్కరరావు, సుజాత, అవినాష్, అమిత్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థినులు



విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి- పలాస



చంద్రశేఖర్ మృతదేహం

స్థానిక ప్రభుత్వ ఐటిఐ రోడ్డులో భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు మద్దిల చంద్రశేఖర్ (37) విద్యుతా ఘాతానికి గురై మంగళవారం మృతి చెందాడు. సూదికొండ కాలనీలో నివాసం ఉంటున్న ఈయన భవన నిర్మాణం పనులు చేస్తూ... కుటుంబాన్ని పోషించేవాడు. ఓ ఇంట్లో పని చేస్తుండగా... విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే తోటి కార్మికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా, అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ విషయంపై కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణను వివరణ కోరగా తమకు ఫిర్యాదు రాలేదని చెప్పారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతునికి భార్య దేవి, అఖిల, పద్మావతి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తూరు: మండలంలోని నివగాంకు చెందిన పడ్డాన బాలకృష్ణ (38) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మంగళవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 18 ఏళ్ల క్రితం భాగ్యలక్ష్మితో వివాహమైంది. అప్పటి నుంచి తాపీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. కొంతకాలంగా మద్యానికి బానిసై భార్య, పిల్లలను పట్టించుకోలేదు. సంపాదనంతా మద్యానికి ఖర్చు చేస్తున్నావంటూ భార్య మందలించేది. దీంతో వారి మధ్య ఘర్షణ చోటు చేసుకునేంది. నెల రోజుల క్రితం ఒడిశా రాష్ట్రం కాశీనగర్‌లో ఉంటన్న కన్నవారి ఇంటికి వెళ్లింది. దీంతో బాలకృష్ణ మనస్తాపానికి లోనై సోమవారం గండి మందును తాగి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు హెచ్‌సి కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బాలకృష్ణ (ఫైల్)

9 కిలోల గంజాయి స్వాధీనం

పలాస : పలాస రైల్వే స్టేషన్ నుంచి ద్వారా తమిళ నాడు ప్రాంతానికి గంజాయిని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించిన గజపతి జిల్లా మరభకు కిరణ్ ఆనందను అరెస్టు చేశామని సిఐ పి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఆమె వద్ద నుంచి 9.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. అక్రమ గంజాయి రవాణాపై నిఘా పెట్టామని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు

ఎయిడ్స్‌పై అవగాహన

పలాస : పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో వైసిబి ట్రూ కుర్స్ ప్రాజెక్టు ఆధ్వర్యాన ఇంటెన్షటి ఫైడ్ ఐఇసి కాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ ఎం.మాధవరావు ప్రచార మార్గాల ద్వారా నివారణ చర్యల గురించి, ఐఇసి ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ కోసం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కొండల మధుబాబు, తమ్మినాన పాపారావు, వైసిబి ట్రక్కర్స్ సిబ్బంది, కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

5న చంద్రమ్మ వర్ధంతి

మందస: శ్రీకాకుళ సాయుధ పోరాట యోధులు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పైల చంద్రమ్మ 5వ వర్ధంతి సందర్భంగా కాశీబుగ్గ పికెఆర్ కళ్యాణ మండపంలో ఈ నెల 25న నిర్వహిస్తున్నట్టు ఎఐకెఎంఎస్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు రాపాక మాధవరావు, గోపి తెలిపారు. మండలంలోని కొండల్లోగాం, కుసుమాల, బంషిగాం, కుడుమాసాయి, భలేగాం గ్రామాల్లో మంగళవారం పర్యటించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్.ధనుంజయ్, ఎస్.పుల్లయ్య, లక్ష్మి, రామారావు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు వద్దు

సీతంపేట: మైనర్లకు వాహనాలివ్వొద్దని ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డలు, వాగులు, చెరువులు నీటితో నిండి ఉన్నాయని కావున చిన్నారుల కదలికలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరారు.

డిజిటల్ స్క్రీన్‌తో అవగాహన

సీతంపేట: స్థానిక ఐటిడిఎ పరిధిలోని ఉన్న తాడిపాయి, కిల్లాడ, ధోనుబాయి, ధారపాడు, గుమడలో మలేరియా అధికారి సత్యనారాయణ, వెలుగు డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో డిజిటల్ స్క్రీన్ గిరిబజార్ వాహనం ద్వారా మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎపిఎం కమలాకుమారి, చంద్రమౌళి, పిహెచ్‌సి వైద్యాధికారి భానుప్రతాప్, అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసరావు, జె.మోహనరావు, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

'ఐతమ్'లో సెమినార్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు 'ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించామని డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైద్యులు సమన్వయం చేయగా, విద్యార్థులకు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై వివరించారు. జిఐఐ విశాఖ చాప్టర్‌కి చెందిన డాక్టర్ శ్రావణి పాల్గొని ప్రమాదాలు సంభవించి సమయం, గుండె ఆగిపోయిన పరిస్థితుల్లో సిపిఆర్ చేయడం, గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించే పద్ధతులు వంటి అంశాలను ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు వివారించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంచడంతో పాటు, అత్యవసర సమయాల్లో సహాయకుడిగా నిలిచే నైపుణ్యాలను పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అసోసియేట్ డీన్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ బి.రాజేష్ పాల్గొన్నారు. అనంతరం శిక్షణ ఇచ్చిన వైద్యులకు అభినందనలు తెలియజేస్తూ... మెమెంటోలు అందజేశారు.



మెమొంటో అందజేస్తున్న నాగేశ్వరరావు

కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలి



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోడానికి ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపకులు తామాడ లక్ష్మణరావు కోరారు. పాతటెక్కలికి చెందిన మణిగాం విశ్వనాథం నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. దీంతో కుడి కాలు, చెయ్యి పడిపోయాయి. ఈ విషయం తెలుసుకుని సమితి సభ్యులు మంగళవారం ఆయనను కలిసి రూ.పది వేలు ఆర్థికసాయం అందించారు. బాధితుడు తన గ్రామంలో చెత్త బండి తిప్పుతూ కుటుంబాన్ని పోశించుకునేవాడు. కార్యక్రమంలో సభ్యులు మండల మహేష్, మండల నీలయ్య, కర్ని వెంకటరమణమూర్తి, తుంగాన ధర్మారావు, అట్టాడ ప్రకాష్, దండుపాటి పవన్‌కుమార్, దండుపాటి సంతోష్‌కుమార్, చింత మహేష్, బొడ్డు బాబూరావు, చొక్కల శంకర్, మాగుబరి చందు, సుంకర రాణి పాల్గొన్నారు.

పి-4పై శిక్షణ

ప్రజాశక్తి- కవిటి

ఎంపిడిఒ కార్యాలయంలో పి-4పై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ త్రినాథ్ మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది, కార్యదర్శులు, విఆర్ఒలు సమన్వయం చేసుకొని పి-4 కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకు ఎకౌంటు లేని వ్యక్తులు, విద్యుత్ సదుపాయం లేని వ్యక్తులు, ఇంట్లో ఎటువంటి ఆధారం లేని కుటుంబాలు, గ్యాస్ సదుపాయం లేని వ్యక్తులను గుర్తించి వారిని పి-4లో చేర్చాలని సూచించారు. అనంతరం శిక్షణ కొనసాగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, కార్యదర్శులు అబ్దుల్‌ఖాన్, మన్మథరావు పాల్గొన్నారు.

నేడు శిక్షణ

పలాస : పి-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్ షిప్)



పలాస : మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పథకం అమలుకు సంబంధించి ప్రామాణిక ఆపరేషన్ విధానంపై బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పరిధిలో సచివాలయం కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నడిపేన రామారావు తెలిపారు. ఈ మేరకు ప్రాథమిక ఏర్పాట్లపై మాస్టర్ ట్రైనర్లు, ట్రైనర్ ఆఫ్ ట్రైనీలతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పి.4 ప్రాముఖ్యత, మార్గదర్శకులు, బంగారు కుటుంబాలతో క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన, ఆపరేషన్ విధానంపై శిక్షణ ఉంటుందని తెలిపారు.

డోలీ గ్రామాలకు తొలి ప్రాధాన్యం

సీతంపేట: స్థానిక ఐటిడిఎ ద్వారా చేపడుతున్న రోడ్డు పనుల్లో డోలీ గ్రామాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఐటిడిఎ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో పదో తరగతి పాసైన విద్యార్థులు తప్పనిసరిగా ఇంటర్‌లో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పక్కాగా అమల య్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు స్కిల్ శిక్షణలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని సూచించారు. వైద్యశాఖకు సంబంధించి మలేరియా, టిబి, డెంగీ వంటి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐటిడిఎలో పర్యాటకుల కొరకు 50 పీవిటిజీ హోమ్ స్టేలను సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.



అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్, సబ్‌కలెక్టర్

ఉత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన

నగర పంచాయతీ కార్యాలయం పనితీరుపై అసంతృప్తి

ప్రజాశక్తి - పాలకొండ

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డి పట్టణంలో మంగళవారం పర్యటించారు. కోట దుర్గమ్మ వారి దర్శనంతో పాటు ఉత్సవాల ఏర్పాట్లపై క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమీక్షించారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయం పనితీరుపై సమీక్షించారు. ముందుగా ఆలయ కార్యనిర్వాహక అధికారి వివి సూర్యనారాయణ, సిబ్బంది అతిథి మర్యాదలతో కలెక్టర్‌ను ఆలయంలో తీసుకెళ్లి ప్రధాన అర్చకులు లక్ష్మీ ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. పశుసంవర్ధక శాఖ నుంచి అధికారికంగా ఆలయానికి ఆనుకొని స్థలం వస్తే ఆలయ అభివృద్ధి జరుగుతుందని పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్ కలెక్టర్ దృష్టి తీసుకురాగా, వెంటనే దీనిపై పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని సబ్ కలెక్టర్ పవర్ స్వప్నల్ జగన్నాధ్‌కు సూచించారు. అదేవిధంగా ఆలయంలో జరుగుతున్న అన్నప్రసాద కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంతమందికి భోజనానికి వస్తారని ఎంత నిధులు అవుతున్నాయని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడినుంచి స్థానిక నగర పంచాయతీకి చేరుకొని కార్యాలయం అస్తవ్యస్తంగా ఉండడంతో కమిషనర్ రత్నరాజును మందలించారు. ప్రభుత్వ కార్యాలయం ఇలాగే ఉంటుందా అంటూ ప్రశ్నించారు. అక్కడ సిబ్బంది ఎవరు ఏ పని చేస్తున్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఆస్తులను కాపాడాలన్నారు. నగర పంచాయతీ ఆస్తులను గుర్తించాలన్నారు. అదేవిధంగా చెరువులకు కూడా బౌండరీలు గుర్తించి, చెరువులకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. నగర పంచాయతీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, ఇఇ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

శరన్నవరాత్రులకు ఆహ్వానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు విజయవాడలో నిర్వహిస్తున్న కనకదుర్గమ్మ శరన్నవరాత్రుల ఉత్సవాలకు ఆలయ ఉద్యోగులు మంగళవారం ఆహ్వానం పలికారు. ఈ మేరకు విజయవాడలోని రవికుమార్ స్వగృహానికి దేవాలయ ఉద్యోగులు చేరుకొని విజయవాడ ఉత్సవ కమిటీ ఆహ్వాన పత్రికను అందించారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో కొన్నేళ్ల నుంచి ఎన్ఎంఆర్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించేటట్లు పియుసి చైర్మన్‌గా సహకరించాలని రవికుమార్‌ను కోరినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు వైద్య శిబిరం

ప్రజాశక్తి- పొందూరు

ఈనెల 25న వికలాంగ విద్యార్థులకు నియోజకవర్గం పరిధిలోని ఆమదాలవలస పట్టణంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ యం.వాగ్దేవి మంగళవారం తెలిపారు. పొందూరు మండలంలోని పలు గ్రామాల్లో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకూ చదువుతున్న ఆరు నుంచి 16 ఏళ్ల వయసు కలిగిన వికలాంగ విద్యార్థులు హాజరుకావాలని కోరారు. ఈ వైద్య శిబిరం ద్వారా వికలాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేసేందుకు అర్హులైన విద్యార్థులను గుర్తిస్తామని తెలిపారు. వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు సంబంధించిన ఆధార్‌కార్డు, సదరం ధ్రువపత్రం, యుడిఐడి కార్డు, రేషన్ కార్డు, విద్యార్థి ఫొటోతో హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం ఈ కింది 9985769631, 9440180050 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న రూపలత

గర్భిణులకు సీమంతాలు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీ గరికపాలెం కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపిఒ రూపలత పాల్గొని గర్భిణులకు సామూహికంగా సీమంతాలు చేసి, పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. మహిళల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైదాధికారి జగన్నాథరావు, సూపర్‌వైజర్ మంగమ్మ, ఎఎన్ఎం ఎం.విజయ, అంగన్వాడీ కార్యకర్త రూపాదేవి, హెల్పర్ హేమ పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు శిక్షణ

కొత్తూరు : మండలంలోని కర్లమ్మ పంచాయతీ మహసింగిలో ఉన్న వెలుగు అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో రిసోర్స్‌పర్సన్ కోట దాస్‌నాయుడు పాలన రాజ్యాంగ పరంగా నిర్వహించాలని, వ్యవసాయం, ఉపాధి హామీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రంలో ఎం.గోపాల్, బి.వెన్నెల, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న దాసునాయుడు